క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానంతో విధులు సమర్థంగా నిర్వర్తించాలి



నగరంపాలెం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విధులు సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలను అందించారు. జిల్లా ఏఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుళ్లల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. శిక్షణ పొందిన వారు పోలీస్‌స్టేషన్‌లో మరింత మెరుగ్గా సేవలందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

22న కవలల పోటీలు




గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన భారతీయ విద్యాభవన్, శ్రేష్ఠ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో కవలల పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు కలెక్టర్ బంగ్లారోడ్డులోని ప్రాంగణంలో మంగళవారం జరిగిన సమావేశంలో శ్రేష్ఠ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జునతో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు. వివరాలకు 83176 13187 ఫోను నంబర్లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ వై.సుస్మిత, ప్రిన్సిపల్ హేమాంబ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో విద్యాభివృద్ధికి బాటలు



గుంటూరు ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రాథమిక విద్యాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి. ఏసురత్నం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దోహదం చేస్తుందని అన్నారు. ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, జిల్లా రీసోర్స్ పర్సన్లు జి.గణేష్, బి.జ్యోతి, ఐ.శైలజ, పి. అనూరాధ, సీఆర్పీలు కె.రాజు, జి. సరళ, కీర్తి పాల్గొన్నారు.

టైం బ్యాంకు ధ్రువపత్రాలు ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: వినూత్న ఆలోచనతో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రవేశపెట్టిన టైం బ్యాంకు కార్యక్రమం ద్వారా ఎంపికైన హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్లో జరిగిన కార్యక్రమంలో వారిని ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు చదువుకునే సమయంలో కొంత భాగాన్ని జీజీహెచ్‌లో రోగుల సేవకు వినియోగించారని వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఎ.బాజీబాబు, వి.అభిలాష్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం

గుంటూరు మెడికల్: జాతీయ వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరు పట్టాభిపురం పెట్రోల్ బంక్ రోడ్డులోని రవీంద్ర నగర్ 1వ లైనులో ఉన్న అనురాగ్ ఓల్డ్ ఏజ్ హోం అండ్ కేర్ సెంటర్‌లో నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పాల్గొన్నారు. హోంలో అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.బి.ఎస్.కె. గిరిధర్, ఎన్సీడీ కన్సల్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

పేద రోగులకు ‘ఉన్నతి’ సేవలు

- ఉచితంగా వంద జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు
- మరోమారు జీజీహెచ్‌లో శస్త్రచికిత్సల నిర్వహణకు ఏర్పాట్లు

ఆధునిక జీవనశైలి వల్ల నేడు మోకీళ్ల సమస్య వయస్సుతో సంబంధం లేకుండా వేధిస్తోంది. రెక్కల కష్టం చేసుకునే రోజువారీ కూలీలు, పేదలు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకోవాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. వారికి గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తమ వంతు చేయూత ఇస్తున్నారు. ఉన్నతి ఫౌండేషన్ స్థాపించి, దాని ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో గతంలో 100 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేశారు. అవసరమైన ఇంప్లాంట్లు సైతం కొనుగోలు చేసి ఇచ్చారు. మళ్లీ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు ఆయన ముందుకొచ్చారు.



ఐఎంఏ అవార్డు అందుకుంటున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి (ఫైల్)

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ హాస్పటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ముందుకు వచ్చారు. గతంలో మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో జరిగిన జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ బూసిరెడ్డి పాల్గొన్నారు. ఈ వైద్యాన్ని పేదప్రజలకు సైతం అందిస్తానని మాట ఇచ్చి జీజీహెచ్‌లో ఉచితంగా 100 మందికి ఆపరేషన్లు చేశారు. ఉన్నతి ఫౌండేషన్ ద్వారా ఇలా ఉచితంగా చేయటమే గాకుండా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు రూ.లక్షలు ఖరీదు చేసే ఇంప్లాంట్లు కూడా తానే స్వయంగా కొనుగోలు చేసి అందించారు. కొవిడ్ మహమ్మారి సమయంలో సైతం జీజీహెచ్ వైద్యులకు ఆయన అండగా నిలబడ్డారు. స్క్రీనింగ్ చేసేందుకు అవసరమైన థర్మల్ స్క్రీనింగ్ మెషిన్లు, శానిటైజర్లు, ఎన్95 మాస్కులు, సర్జికల్ గ్లౌజ్‌లు, పల్స్ ఆక్సీమీటర్లు, యాప్రాన్‌లు అందించి వైద్యులకు భరోసా కల్పించారు. గత ఏడాది విజయవాడలో వరదలు ముంచెత్తినప్పుడు బాధితులకు బాసటగా ఆర్థిక సహాయాన్ని అందించారు. కీలకమైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో కార్యదర్శిగా పని చేస్తూ ఐఎంఏకు చేసిన సేవలకు గాను 2023–24 సంవత్సరానికి గతేడాది డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ సెక్రటరీ అవార్డును సైతం అందుకుని అందరి మన్ననలు పొందారు. కేరళలోని అయ్యప్ప భక్తులకు సైతం గత ఏడాది డిసెంబర్‌లో వారం రోజులపాటు తెలుగు వైద్యుల బృందంలో వెళ్లి ఉచిత వైద్యసేవలు అందించారు. గుంటూరు నగరంలో సైతం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి తమవంతు చేయూతగా డస్ట్‌బిన్‌లు అందజేశారు. నగరాన్ని సుందర వనంగా తీర్చిదిద్దేందుకు పలు చోట్ల మొక్కలు నాటేందుకు సాయం అందించారు.

ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు...

బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను 2007లో ప్రారంభించారు. ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలను, అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలన్నీ కూడా గ్రామీణ ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్‌లపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, గతంలో ఆపరేషన్లు చేయించుకుని ఆనందంగా జీవితం కొనసాగిస్తున్న వారిని సదస్సులకు తీసుకెళ్లి ప్రజల్లో భయం పోయేలా చేస్తున్నారు. ప్రపంచ స్థాయి ఇంప్లాంట్లను గుంటూరుకు తీసుకొచ్చి జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్‌లకు గుంటూరు హబ్‌గా మారేలా తనవంతు కృషి చేస్తున్నారు.

పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే...

డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మైసూర్‌లో 1994లో ఎంబీబీఎస్, దావనగిరిలో 2003లో ఆర్థోపెడిక్ సర్జరీలో పీజీ పూర్తి చేశారు. హైదరాబాద్ సన్‌షైన్ హాస్పటల్‌లో 2003–05 వరకు డాక్టర్ గురవారెడ్డి వద్ద, తదుపరి ఇంగ్లండ్‌లో 2005లో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. పుట్టిపెరిగిన జిల్లా నుంచి రోజూ అధిక సంఖ్యలో వ్యయప్రయాసలతో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లకు వస్తున్న విషయాన్ని గమనించారు. రోగులు ఇంత దూరం వచ్చేపని లేకుండా పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే కృతనిశ్చయంతో జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ల కోసం ప్రత్యేకంగా గుంటూరులో సాయి భాస్కర్ హాస్పటల్ ఏర్పాటు చేశారు. మొదట్లో ప్రజలకు జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు అంటే చాలా భయంతోపాటుగా పలు అనుమానాలు ఉండేవి. వాటిని తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చిన వారిని చూపించి వారిలోని భయం పోయేలా చేశారు.

ఆపరేషన్లతో నూతన జీవితం



మోకీళ్ల నొప్పులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ అవసరం ఉండదు. కేవలం వందలో ఐదు శాతం మందికే ఆపరేషన్లు అవసరం అవుతాయి. కనీసం నాలుగు అడుగులు కూడా వేయలేని దుస్థితికి వృద్ధులు చేరుకుని మంచాలకు, కుర్చీలకు పరిమితమవుతారు. అలాంటి వారికి ఆపరేషన్లు వరం లాంటివి. ఆపరేషన్ అనంతరం మూడు రోజులకే నడక ప్రారంభించి, వారం రోజుల తర్వాత పనులు చక్కబెట్టుకోవచ్చు. మా వంతుగా ఉచితంగా ఈ ఆపరేషన్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

వందశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలి


డీవైఈవోకు డైరీ అందజేస్తున్న సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి.ఏసురత్నం పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని ఉప విద్యాశాఖాధికారి చాంబర్లో డీవైఈవోను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హైమారావు మాట్లాడుతూ గుంటూరు డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి ఎన్‌టీఏ పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. డీవైఈవోను కలిసిన వారిలో సంఘ సీనియర్ నాయకులు జి. సతీష్ బాబు, జె. పార్థసారథి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, నాయకులు ఎస్. వేణుగోపాలరావు, పి. సాయి విశ్వనాథ్, పి. లలితబాబు, కె. వీరరాఘవులు, కె. వేణుగోపాల్, ఏవీ కృష్ణారావు, ఏ హరగోపాల్, ఏ వేంకటేశ్వరరావు, టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ఉత్తమ ప్రతిభ



విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల మూడో ఉత్తమ పాఠశాలగా నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో మంగళవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులతో పోటీపడిన తమ విద్యార్థులు 25 బంగారు, 18 రజత పతకాలు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్లు వి. హేమలత, ఎస్.కమల, ఎమ్.ఝాన్సీలను విశిష్ట ఆచార్య పురస్కారంతో సత్కరించారని పేర్కొన్నారు. పాఠశాల పాలవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద రావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతి దేవి, కోఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలపై వివక్ష, బాల్య వివాహాలను రూపు మాపడంలో వెనుకంజలోనే ఉన్నామని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి వర్గాల్లోనే బాల్య వివాహాలు జరుగుతున్నాయని చెప్పారు. కళాశాల ఎన్ఎస్ఎస్–1 అధికారి ఏ శ్రీధర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకున్న వారు రాజ్యాంగం కల్పించిన సదుపాయాలను పొందలేకపోతున్నారని అన్నారు. ఎన్ఎస్ఎస్–2 అధికారి వై.చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్న వయసులో వారికి పుట్టే బిడ్డలకు సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా మేజర్ కాకుండా వివాహాలు చేసుకోబోమని విద్యార్థినులచే ప్రమాణం చేయించారు. ఉత్తమ ప్రసంగాలు చేసిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ రాజేశ్వరి, ఇందిర, మల్లేశ్వరి, భవానీదుర్గ పాల్గొన్నారు.

నేడు ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల మహాసభ



విలేకరులతో మాట్లాడుతున్న ఎం.రమేష్‌బాబు

లక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం గుంటూరు నగరంలోని వీఎస్‌కే హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రథమ నిర్మాణ మహాసభలను నిర్వహించనున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు తెలిపారు. మంగళవారం గుంటూరు నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, అరుణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు అంజిబాబులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14,800 మంది ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నా వేతనాలు తక్కువగా వస్తున్నాయన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. వీరి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం జరిగే మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగుని రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్యలు హాజరవుతున్నారని తెలిపారు.

ఆలపాటి నామినేషన్ రద్దు చేయాలి

- లేదంటే హైకోర్టును ఆశ్రయిస్తాం
- దళిత సంఘ నాయకుడు బాబురావు


విలేరులతో మాట్లాడుతున్న పిల్లి బాబురావు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): భూ ఆక్రమణలకు పాల్పడినందున ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజా నామినేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని దళిత సంఘం నాయకుడు పిల్లి బాబురావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్ఓ షేక్ ఖాజావలికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2004లో గుంటూరు రూరల్ మండలం పెద పలకలూరు గ్రామంలో సర్వే నంబర్ 282, 280, 281లోని 46.82 ఎకరాల ఇనాం భూములను ఆలపాటి రాజేంద్రప్రసాద్ తప్పుడు పత్రాల ద్వారా అక్రమ సేల్ డీడ్ చేసి పద్మావతి నగర్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ఆరోపించారు. అప్పటి నుంచి పేదల తరపున అనేక నిరసనలు, దీక్షలు , పోరాటాలు చేశామని చెప్పారు. 2004లో జిల్లా కలెక్టర్ చేత విచారణ జరిపించి న్యాయం చేస్తామని సీసీఎల్ఎస్ ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. నేటికీ ఆ వ్యవహారం పెండింగ్‌లో ఉందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజాకు అర్హత లేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మరియు రిటర్నింగ్ అధికారి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలపాటి నామినేషన్ రద్దు చేయాలని, లేని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

రెండు రోజుల్లో సర్వేలు పూర్తి చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నీ 2 రోజుల్లో పూర్తయ్యేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం సర్వేల వేగవంతంపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, నోడల్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... సర్వేలను 20వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానా

గుంటూరు నగరంలో మార్చి 1వ తేదీ నుంచి రోడ్లపై వ్యర్థాలు వేసే కమర్షియల్ సంస్థలకు భారీ మొత్తంలో జరిమానా విధించాలని కమిషనర్ పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులు, కార్యదర్శులతో పారిశుద్ధ్య పనులు, ట్రేడ్ లైసెన్స్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇళ్లల్లో వారు కూడా ప్రజారోగ్య కార్మికులకే వ్యర్థాలను అందించాలని తెలిపారు. బయట ప్రాంతాల్లో వేస్తే జరిమానా తప్పదన్నారు. పారిశుద్ధ్య సమస్యలపై అందే ఫిర్యాదులను గంటల వ్యవధిలో పరిష్కరించేలా బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఎంఓహెచ్ఓ డాక్టర్ పి.జె. అమృతం, ఎంహెచ్ఓ రవిబాబు, వెటర్నరీ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్ఓలు రాంబాబు, ఆనందకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

ప్రతి రోజు ఉదయం విధులు నిర్వహించే ప్రజారోగ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని, మంగళవారం విధి నిర్వహణలో కారు ప్రమాదంలో మృతి చెందిన కార్మికురాలు జి.కొండమ్మ కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కొండమ్మ మృతదేహాన్ని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు సీఎంఓహెచ్ డాక్టర్ పి.జె. అమృతం, ప్రజారోగ్య అధికారులు ప్రభుత్వ వైద్యశాలలో పరిశీలించారు. కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

రైల్వే నిర్లక్ష్యం వల్లే మరణాలు


కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో రెండు రోజుల క్రితం జరిగిన తొక్కిసలాటలో 18 మంది మృతి చెందడం విచారకరమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం పలువురు వక్తలు ఈ ఘటనపై మాట్లాడారు. సమావేశంలో సీనియర్ అధ్యాపకుడు సి.హెచ్.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన దుర్ఘటనకు రైల్వే శాఖ నిర్లక్ష్యమని ఆరోపించారు. రైల్వే శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే నివారించవచ్చన్నారు. ప్రయాణికులకు సరైన సమాచారం లేక పోవడం, రద్దీని క్రమబద్ధీకరించడంలో అధికారులు వైఫల్యం చెందారన్నారు. విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ప్రయాణికులకు సేవలందించడంలో, రద్దీ స్టేషన్‌లలో అవాంఛనీయ సంఘటనల నిరోధానికి రక్షణ వ్యవస్థ ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కృష్ణారావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

లక్ష్మీపురం: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్ అన్నారు. మంగళవారం కొత్తకాలనీలో డీఎస్పీ అరవింద్ నేతృత్వంలో నగరంపాలెం పోలీసు స్టేషన్ సీఐ నజీర్ బేగ్ సిబ్బందితో వారధి కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ అరవింద్ స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యపానం వాటిపై తమకు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను రోడ్డుపాలు చేసుకోవద్దన్నారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీఐ నజీర్‌బేగ్ మాట్లాడుతూ నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లపై నిఘా ఉంటుందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసినా, ఓటీపీలు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్సై ఆంజనేయులు, సలాం, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని కలిసిన షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ నగర అధ్యక్షురాలిగా నియమితులైన నూరిఫాతిమా.. ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): 21వ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు దృష్ట్యా బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అరండల్‌పేట 1 నుంచి 3వ లైన్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అక్కిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

‘రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి’

లక్ష్మీపురం: రాష్ట్రంలో రాజకీయ పార్టీకి, ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందన్న విషయం పిడుగురాళ్ల వైస్ చైర్మన్ ఎన్నిక మరోసారి నిరూపించిందని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇదే డిమాండ్ చేస్తున్నామని, అంతకుమించిన తక్షణ పరిష్కారం రాష్ట్రంలోని సంక్షోభానికి లేదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముత్యాలరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన కాండ్రు తిరుపతయ్య (74) జీఆర్పీ ఏఎస్ఐగా విధులు నిర్వహించి వీఆర్ఎస్ తీసుకున్నాడు. మతిస్థిమితం లేక అనేక మార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసులు వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

ఐటీ చెల్లింపులపై అవగాహన ముఖ్యం

నెహ్రూనగర్: ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్న ప్రతి ఉద్యోగి అన్ని విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఇన్‌కంట్యాక్స్ అదనపు కమిషనర్ ఎస్. సుప్రియ తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఉద్యోగులకు ఇన్‌కంటాక్స్ రిటర్న్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ వచ్చే ఆదాయంలో నిబంధనల ప్రకారం టాక్స్ చెల్లించాలన్నారు. నగరపాలక సంస్థ సచివాలయ కార్యదర్శుల ద్వారా కూడా ఇన్‌కంటాక్స్ రిటర్న్ వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఇన్‌కంటాక్స్ డిప్యూటీ కమిషనర్ లలిత, అసిస్టెంట్ కమిషనర్ డి. వేణుగోపాల్, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీనివాసరావు, సెక్రటరీ పి. శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్లు గల్లంతు అయ్యాయని నిరసన

నెహ్రూనగర్: గత ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉన్న ఓట్లు ప్రస్తుతం గల్లంతు అయ్యాయని ఎమ్మెల్సీ అభ్యర్థి గంగోలు శామ్యూల్ డిమాండ్ చేశారు. మంగళవారం లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.